క్లుప్తంగా

ఆరోగ్యం, విద్యపై శ్రద్ధ చూపాలి

వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్



శిక్షణలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్

సామర్లకోట: సుస్థిరాభివృద్ధి సాధనలో బాలల వికాస గ్రామం కోసం ఆరోగ్యం, విద్యపై శ్రద్ధ చూపాలని ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక ఈటీసీలో 11 జిల్లాలోని అధికారులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై రెండో బ్యాచ్ జిల్లా స్థాయి అధికారులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. 11 జిల్లాల నుంచి మెడికల్, ఐసీడీఎస్, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. శిక్షణ కేంద్రం చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ జీఎస్ శ్రీదేవి, ఫ్యాకల్టీలు కె.నిహారిక, పి.శ్రీనివాసరావు, ప్రసాద్, వెంకటేశ్వర్లు, పద్మజ, ఆంజనేయులు, చక్రపాణి శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ శిక్షణను పర్యవేక్షించారు.

ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహించాలి

పిఠాపురం: ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో అనధికారికంగా నియమించిన ఉద్యోగాలపై చర్చించడానికి ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌కు కౌన్సిలర్లు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకురాకుండా ఏడుగురు ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారని కౌన్సిలర్లు పేర్కొన్నారు., ఈ విషయాన్ని కౌన్సిల్ అజెండాలో చేర్చాలని తాము కోరినా, తీసుకురానందున ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని వినతిపత్రంలో వారు స్పష్టం చేశారు.

గణిత భావనలపై పట్టు పెంచుకోవాలి



శిక్షా సప్తాహ్‌లో మాట్లాడుతున్న సాయిరామకృష్ణ

సామర్లకోట: విద్యార్థులు భాషలతో పాటు గణిత భావనలపై పట్టు పెంచుకోవాలని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా మంగళవారం ఆయన పాల్గొని గణిత భావనలపై పట్టు పెంచుకోవడం ద్వారా తార్కిక ఆలోచన, సృజనాత్మక నైపుణ్యాలు, ప్రశ్నించే వైఖరి ద్వారా శాస్త్రీయ దృక్పథం అలవడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.అరుణ, డీవీఆర్ వల్లి, ఎ.శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు బీజేపీ నేతల వినతి

పిఠాపురం: అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని ఫొటో ఏర్పాటు చేయాలని గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్‌కు స్థానిక బీజేపీ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫొటోలు ఏర్పాటు చేసినట్టుగానే, ప్రధాని ఫొటో ఏర్పాటు చేయాలని కోరారు.

భవనం పైనుంచి పడి బెంగాల్ వాసి మృతి



అబ్దుల్ బరి మృతదేహం

కాకినాడ రూరల్: కాకినాడ అర్బన్ రమణయ్యపేట 2వ డివిజన్‌లోని ఫ్రెండ్స్ కాలనీ వద్ద నిర్మాణంలో ఉన్న ఐదంతస్తుల భవనం వద్ద పశ్చిమ బెంగాల్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు అబ్దుల్ బరి ఎస్‌కే (27) మంగళవారం ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడు. సర్పవరం పోలీసులు తెలిపిన వివరాల మేరకు భవన నిర్మాణంలో పనిచేస్తున్న అబ్దుల్ బరి రెండో ఫ్లోర్‌లో పని చేస్తూ మెటీరియల్ అందించే క్రమంలో జారి నేలపై పడిపోయాడు. వెంటనే అతడిని సర్పవరం జంక్షన్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన జకారియా ఎస్‌కే ఫిర్యాదు మేరకు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. కాగా సమాచారం అందుకున్న తరువాత ఆయన నిర్మాణంలో ఉన్న భవనం వద్దకు వెళ్లి పరిశీలించి గాయపడిన అబ్దుల్‌కు మెరుగైన వైద్యం అందేలా ఆస్పత్రి వైద్యులతో మాట్లాడారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. మృతుడి బంధువులు పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా సంతోష్‌పూర్‌లో ఉన్నారని, బరితో పాటు అతడి తమ్ముడు, పలువురు పశ్చిమ గోదావరి జిల్లా వాసులు కాకినాడలో పనిచేస్తున్నారు.

ఆరుగురు జూదరులపై కేసు

కరప: మండలం పెనుగుదురులో ఆరుగురు జూదరులపై కేసు నమోదు చేసినట్టు కరప ఎస్ఐ టి.రామకృష్ణ మంగళవారం రాత్రి తెలిపారు. పెనుగుదురు రామాలయం వద్ద పేకాడుతున్న సమాచారం రావడంతో ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడిచేశారు. అక్కడ పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ 5,050 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం కాకినాడ కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఈ పైపు.. అదో టైపు

- కాలం చెల్లిన ప్రధాన పైపులైన్లు
- తరచూ మరమ్మతులకు గురవుతున్న వైనం
- తాగునీటికి ప్రజల ఇబ్బందులు
- పూర్తికాని జల్‌జీవన్ మిషన్ పనులు
- నిర్లిప్త ధోరణిలో అధికారులు



పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో మరమ్మతులకు గురైన ప్రధాన పైపులైన్



వాకతిప్పలో ఉన్న తాగునీటి పథకం



వాకతిప్ప సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్



24 ఏళ్ల క్రితం నిర్మించిన పైపులైన్

కొత్తపల్లి: కాలం చెల్లిన తాగునీటి ప్రధాన పైపులైన్లతో ఇబ్బందులు తప్పడం లేదు. అవి తరచూ మరమ్మతులకు గురికావడంతో ప్రజలకు సక్రమంగా తాగునీరు అందడం లేదు. మండలంలోని వాకతిప్పలో ఉన్న నాగులాపల్లి ఏరియా సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకం ద్వారా వివిధ గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. రూ.9.80 కోట్ల నాబార్డు నిధులతో ఈ తాగునీటి పథకానికి 2000 ఏప్రిల్ 11న అప్పటి లోక్‌సభ స్పీకర్ దివంగత జీఎంసీ బాలయోగి శంకుస్థాపన చేశారు. దీనిని 2003 మార్చి 14న అప్పటి రాష్ట్ర ఆర్ అండ్‌బీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. కొత్తపల్లి మండలంలో ఉన్న 18 పంచాయతీలు, 24 శివారు గ్రామాలతో పాటు, పిఠాపురం మండలం నవఖండ్రవాడకు దీనిద్వారా తాగునీటిని అందిస్తున్నారు.

54 ఓవర్‌హెడ్ ట్యాంకులు

ఈ పథకం ద్వారా మండలంలో ఉన్న 54 ఓవర్‌హెడ్ ట్యాంకులకు తాగునీటికి అందిస్తున్నారు. మండలంలోని సుమారు 90 వేల జనభాకు ఒక్కొక్కరికీ రోజుకు 55 లీట్లర్ల చొప్పున సుమారు 50 లక్షల లీటర్లను సరఫరా చేస్తున్నారు. మండలంలో ఈ తాగునీటి పథకానికి సంబంధించి సుమారు 85 కి.మీ. పైపులైన్ నిర్మించారు.

తరచూ మరమ్మతులే..

తాగునీటి పథకాన్ని నిర్మించి సుమారు 24 ఏళ్లవుతుంది. అప్పట్లో నిర్మించిన పైపులైన్లకు కాలం చెల్లడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. పిఠాపురం-ఉప్పాడ, కొత్తపల్లి-గోర్స, వాకతిప్ప-నాగులాపల్లి రోడ్ల విస్తరణతో పైపులైన్లు రోడ్డు మధ్యలోకి చేరాయి. తరచూ మరమ్మతులకు గురికావడంతో, తవ్వుతున్న గోతుల వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అభివృద్ధికి రూ.7 కోట్లు

ఈ రక్షిత మంచినీటి పథకాన్ని అభివృద్ధికి గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషితో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.7.14 కోట్లు మంజూరయ్యాయి. అప్పటి ఎమ్మెల్యే పెండెం దొరబాబు గతేడాది డిసెంబర్ 30న ఈ తాగునీటి పథకం అభివృద్ధికి శంకుస్థాపన చేశారు.

అవాంతరాలు

ప్రతి ఇంటికీ ఉచితంగా తాగునీరు, కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన జల్‌జీవన్ మిషన్ పథకానికి అవాంతరాలు ఏర్పడ్డాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఈ పథకాన్ని ప్రారంభించినప్పటికీ, మధ్యలోనే పనులు నిలిచిపోయాయి. ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించినప్పటికీ, ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వలేదు. కొండెవరం, ఇసుకపల్లి, కొత్తపల్లి, కొమరగిరి, మూలపేట తదితర గ్రామాల్లో ఈ పథకం మధ్యలోనే నిలిచిపోయింది. సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టకపోవడంతో, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రధాన పైపులైన్లు మార్చాలి



తరచూ మరమ్మతులకు గురవుతున్న ప్రధాన పైపులైన్లు పూర్తి స్థాయిలో మార్చాలి. నీటి సరఫరా నిలిచిపోతే, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలి. తాగునీటి పథకంపై జిల్లా స్థాయి అధికారులు దృష్టి పెట్టాలి. 24 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పైపులైన్లను పూర్తి స్థాయిలో మార్చేలా అధికారులకు ప్రతిపాదనలు అందజేయాలి.

– ఆనాల సుదర్శన్, మండల అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ, కొత్తపల్లి

పరిష్కారానికి చర్యలు

మండలంలో తాగునీటి సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించాలంటే కుతుకుడుమిల్లి శివారు ఉన్న మద్దిల చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు కేటాయించాలి. దీనిపై ఉన్నత స్థాయి అధికారులకు నివేదికను పంపించాం. దానిని కేటాయించేలా ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరుతున్నాం. ప్రధాన రోడ్డులో ఉన్న పైపులైన్లు మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జల్‌జీవన్ మిషన్ పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం.

– సంధ్య, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కొత్తపల్లి

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం
- నియోజకవర్గంలో విస్తృత పర్యటన
- ఆస్పత్రుల్లో వసతులపై ఆరా
- పాఠశాలల్లో విద్యా బోధనపై సూచనలు



సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం పొందిన వారి నుంచి సమాచారం సేకరిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్



జి.రాగంపేట జగనన్న కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

పెద్దాపురం/సామర్లకోట: పెద్దాపురం మండలంలోని పులిమేరు పీహెచ్‌సీ, అంగన్‌వాడీ పాఠశాలలను కలెక్టర్ పరిశీలించి విద్య, వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఐసీడీఎస్ ద్వారా అందుతున్న సంక్షేమ ఫలాలపై ఆరా తీసి తల్లులు, గర్భిణీ, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని సూచించారు. అలాగే కాండ్రకోట ఏలేరు దబ్బ కాలువ నిర్మాణంపై చేపట్టాల్సిన పురోగతిని సమీక్షిస్తూ రైతుల సమస్యలు అడిగి తెలుసుకు దబ్బ కాలువ నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం పట్టణంలోని బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి విద్యా విధానం, వసతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో నూరు శాతం ఫలితాలు సాధించేలా బోధన సాగాలని ఆయన అధికారులకు సూచించారు. అలాగే నియోజకవర్గ పరిధిలో ఉత్తమ సేవలు అందిస్తున్న సిబ్బంది అభినందించారు. ముందుగా పెద్దాపురం శివారు జి.రాగంపేట జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి తాగునీటి సరఫరాపై ఆరా తీసి జీఎల్ఆర్ ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ జేవీఎస్ రామారావు, జిల్లా పరిషత్ సీఈఓ సత్యనారాయణ, డీపీఓ భారతి సౌజన్య, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పి.సరిత, ఎంపీడీఓ ఉషారాణి, మున్సిపల్ కమిషనర్ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సామర్లకోట మండలంలో..

సామర్లకోట మండలం పలు గ్రామాల్లోని పలు కార్యాలయాలు, యూనిట్లు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వాటి నిర్వహణపై ఆరా తీశారు. సామర్లకోట మండలం అచ్చంపేటలో వర్మీ కంపోస్టు యూనిట్‌ను పరిశీలించి నిర్వహణ విధానాన్ని తెలుసుకున్నారు. అనంతరం కల్యాణ మండపం వద్ద ఉన్న తాగునీటి ట్యాంకు ఇన్‌లైన్ క్లోరినేషన్ ఫార్ములాను ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను అడిగి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఉండూరులోని జెడ్పీ హైస్కూల్‌ను పరిశీలించి ఉత్తీర్ణతా శాతాన్ని హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, డీఈఓ పి.రమేష్, ఎంఈఓలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్య, మండల ప్రత్యేకాధికారి పి.రాధాకృష్ణ, ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్, ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణసత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ తనిఖీ..

అనంతరం కలెక్టర్ స్థానిక సీహెచ్‌సీని పరిశీలించి ఆస్పత్రి ఇన్‌చార్జి ప్రమీలను రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోగులను పలకరించి వసతులు బాగున్నాయా అని ప్రశ్నించారు. మందుల కొరతనూ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కెనాల్ రోడ్డులోని హుస్సేన్‌పురంలో ఉన్న గోదావరి కాలువలో గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలించారు. అలాగే వేట్లపాలెం పీహెచ్‌సీని పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టరు శ్రీహిమవతి, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, తహసీల్దార్ వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో కలెక్టర్ పూజలు

ఈ సందర్భంగా పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారా రామ భీమేశ్వర స్వామి ఆలయంలో కలెక్టర్ షాన్ మోహన్ పూజలు చేశారు. ఆయనకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ పండితులు వేదాశీర్వచనం చేసి, స్వామివారి ప్రసాదం, ఫొటో అందజేసి ఆలయ చరిత్రను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా భక్తుల సమస్యలను సైతం వివరించగా ఆయన లిఖితపూర్వకంగా ఇవ్వాలని ఈఓకు సూచించారు.

టెంట్ హౌస్ సప్లయర్ల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి శ్రీనివాసరావు

సామర్లకోట: టెంట్ హౌస్ సప్లయర్ల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడుతున్నట్టు జిల్లా సంఘ అధ్యక్షుడు సంగిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక అన్నపూర్ణ కల్యాణ మండపంలో పట్టణ యూనియన్ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా యూనియన్ సమావేశం జరిగింది. సంగిశెట్టి మాట్లాడుతూ టెంట్ హౌస్ యజమానుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన టెంట్ హౌస్ సప్లయ్ యజమానులు సంగిశెట్టి శ్రీనివాసరావు (కాకినాడ)ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మేకా శ్రీనివాసరావు (సామర్లకోట), కార్యదర్శి నూకల ఉదయ భాస్కరరావు (కాకినాడ రూరల్), కోరాకుల రామకృష్ణ (జగన్నాథపురం), సహాయ కార్యదర్శిగా మాధవరపు రామకృష్ణ (కాకినాడ రూరల్), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పిల్లాడి రామ కృష్ణ, సుంకర చిట్టిబాబు, గారపాటి శివ, కె శ్రీను ఎన్నిక అయ్యారు.

నేడు కమిషనర్ భావన బాధ్యతల స్వీకరణ

కాకినాడ: నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి భావన బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉదయం 9.30 నుంచి 10 గంటల సమయంలో ఆమె విధుల్లో చేరనున్నారు. ప్రస్తుత కమిషనర్ వెంకటరావు స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. కాగా మంగళవారం రాత్రి కాకినాడ చేరుకున్న ఆమెకు కమిషనర్ జె.వెంకటరావు, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటరావు ఇతర అధికారులను ఆమెకు పరిచయం చేశారు. కార్యక్రమంలో ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, ఏసీ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఈఈ మాధవి, పలువురు డీఈలు, ఏఈలు కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

రోటరీ స్మార్ట్ సిటీ క్లబ్ నూతన కార్యవర్గం

బోట్‌క్లబ్: రోటరీ స్మార్ట్ సిటీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రతిష్ఠానోత్సవం స్థానిక రోటరీ క్లబ్‌లో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు, గౌరవ అతిథిగా రాజీవ్ గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకట్రావు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ సామా భాస్కర్ పాల్గొన్నారు. 2024–25 సంవత్సరానికి అధ్యక్షుడిగా పోతుల రాంజీ, కార్యదర్శిగా నామాడి స్వామి శేఖర్‌తో ఇతర సభ్యులతో ముఖ్య అతిథులు ప్రమాణస్వీకారం చేయించారు. సుమారు 160 సార్లు రక్తదానం చేసిన అనుసూరి మోహన్‌ను సత్కరించారు.

కుటుంబ సభ్యులతో కలిసి నిరసన



రాక్ సిరామిక్స్ వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేస్తున్న కార్మికులు

సామర్లకోట: రాక్ సిరామిక్స్ నుంచి తొలగించిన కార్మికులు స్థానిక ఏడీబీ రోడ్డులోని ఫ్యాక్టరీ గేటు ఎదురుగా కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ నుంచి కార్మికులను తొలగించి 99 రోజులు అవుతున్నా ఇప్పటి వరకు వారికి న్యాయం చేయలేదని ఆరోపించారు. తొలగించిన కార్మికులకు ఇంటి అద్దెలు కట్టుకోలేని పరిస్థితి ఏర్పడటంతో భార్యా పిల్లలో రోడ్డు మీదకు వచ్చారని తెలిపారు. ఆందోళనకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్, ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చింతల సత్యనారాయణ, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గూనూరు రమణలు మద్దతు తెలిపారు.

వరద ఉధృతిపై అప్రమత్తంగా ఉండాలి

సుద్దగెడ్డ వాగును పరిశీలించిన ఆర్డీఓ కిషోర్



అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్డీఓ కిషోర్

పిఠాపురం: భారీ వర్షాల నేపథ్యంలో గొల్లప్రోలు నగర శివారు సుద్దగెడ్డ వాగు వరద ఉధృతి పెరిగే అవకాశాలు ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ కిషోర్ ఆదేశించారు. రెవెన్యూ, మున్సిపల్, పోలీసు అధికారులతో కలిసి మంగళవారం ఆయన సుద్దగెడ్డ వాగును పరిశీలించారు. ఈ ప్రాంత పరిధిలోని కాలనీవాసులకు తాగునీరు అందజేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆయన ఆదేశించారు. గర్భిణులు. వృద్ధులు, వికలాంగులు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎవరైనా ఉంటే, వారిని తక్షణం బయటకు తీసుకురావాలని స్పష్టం చేశారు. వరద ఉధృతి పెరిగితే ఏ ప్రాంతాలు ముంపు బారిన పడతాయో ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. ఆయా ప్రాంతాల్లో మంచినీరు, భోజన వసతి సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని, సిబ్బందిని నియమించి వరద ఉధృతిపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ ఉదయభాస్కర్, గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్ రవికుమార్, సీఐ జి.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛత వారోత్సవాలు



కుమారపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



యండపల్లిలో డస్ట్‌బిన్లను పంపిణీ చేస్తున్న బాలసరస్వతి

పిఠాపురం: ప్రజలందరూ పరిసరాల శుభ్రత పాటించాలని మండల ప్రత్యేకాధికారి, మైనార్టీస్ ఈడీ సునీల్‌కుమార్ అన్నారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కుమారపురం, చిత్రాడ పంచాయతీల్లో ట్రాక్టర్ల సాయంతో చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతను పాటించడం ద్వారా చెత్త పేరుకుపోకుండా సహకరించాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు, ఎంపీడీఓ బందారు చిన్నారావు, సర్పంచ్‌లు నల్ల రామారావు, సునీత, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

కొత్తపల్లి: గ్రామాల్లో పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మండల ప్రత్యేకాధికారి ఎం.బాలసరస్వతి అన్నారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆమె మంగళవారం పర్యటించారు. కొత్తపల్లి జెడ్పీ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కొత్త మూలపేటలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. యండపల్లిలో ఇంటింటికీ డస్ట్ బిన్లను పంపిణీ చేశారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీలు, పారిశుధ్య మెరుగుకు చర్యలు, ఓవర్‌హెడ్ ట్యాంకుల శుభ్రత వంటి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటనారాయణ, ఈఓ పీఆర్డీ భాస్కరరావు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

చురుగ్గా గుర్రపు డెక్క తొలగింపు



మాండవ్య నారాయణస్వామి ఆలయం వద్ద గుర్రపు డెక్క తొలగిస్తున్న కూలీలు

సామర్లకోట: ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ నుంచి వస్తున్న నీటి ద్వారా గోదావరిలోకి గుర్రపు డెక్క వచ్చి చేరుతోంది. దీంతో పీబీ దేవం నుంచి స్థానిక లాకుల వరకు గుర్రపు డెక్క తొలగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఖరీఫ్ సాగుతో పాటు, శివారు భూములకు నీరు అందే విధంగా చూడాలని అధికారులు ఆదేశించడంతో ఈ పనులు వేగవంతం చేశారు. హుస్సేన్‌పురం, మాండవ్యనారాయణస్వామి ఆలయాల వద్ద ఉన్న కాలిబాట వంతెనల వద్ద గుర్రపు డెక్క చిక్కుకుపోయింది. ఇరిగేషన్ డీఈ రవికుమార్ పరిస్థితిని పరిశీలించి దానిని పూర్తిగా తొలగించాలని ఆదేశించారు.